ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 12 | ఆదివారం 12-01-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## విద్యార్థి రాజకీయాలు చారిత్రక అవసరం

- సైద్ధాంతిక భావజాలం లేనందునే ఫిరాయింపులు
- యూనివర్సిటీలకు పూర్వ వైభవం తీసుకొస్తున్నాం - ఎవరు సలహాలిచ్చినా స్వీకరించేందుకు సిద్ధం
- విద్యాసాగర్‌రావు సహకారం రాష్ట్రానికి అవసరం - కేంద్ర మంత్రులు సహకరించాలి: సీఎం రేవంత్
- హైడ్రా.. అభినందనీయం: విద్యాసాగర్‌రావు - విద్యాసాగర్‌రావు స్వీయచరిత్ర 'ఉనిక' ఆవిష్కరణ

**హైదరాబాద్, జనవరి 12:** విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల రాజకీయాలు చారిత్రక అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో సైద్ధాంతిక భావజాలం ఉన్నవారు లేకపోవడం వల్లే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థి రాజకీయాల్లో సిద్ధాంతపరంగా రాణించిన వారుంటే.. ప్రజాప్రతినిధులుగా అధికారంలో ఉన్నా, లేకపోయినా.. నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాలపాటు జీవితాలను త్యాగం చేస్తారని తెలిపారు. ప్రజా సమస్యలపై విద్యార్థి సంఘాలు పోరాటాలు చేయడం వల్లనే చైతన్యం వస్తుందని, ఆయా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పోరాటం కంటే.. ఓయూ, కేయూ విద్యార్థులు ముం దుండి ఉద్యమించడం వల్లనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని అన్నారు. అలాంటి విద్యార్థి రాజకీయాలను తెలంగాణలో పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని పార్టీలూ విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆదివారం తాజ్‌కృష్ణాలో జరిగిన ఓ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు స్వీయచరిత్ర 'ఉనిక' పుస్తకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఒకప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి రాజకీయాల్లో ఓవైపు జార్జిరెడ్డి, మరోవైపు సాగర్‌జీ (విద్యాసాగర్‌రావు) వంటివారు నమ్మిన సిద్ధాంతం కోసం గట్టిగా నిలబడ్డారని తెలిపారు. విద్యార్థి దశలో సిద్ధాంతపరమైన భావజాలం ఉన్నవారు తక్కువగా ఉండడం, విద్యార్థి రాజకీయాల్లో చైతన్యం కోల్పోవడం వల్లనే ప్రజాప్రతినిధులు కావాలనుకుంటున్న వారు ఏ పార్టీ అయినా ఫరవాలేదని, తమకు పదవి ఉంటే చాలునని అనుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 'పార్టీ ఫిరాయింపులపై నేను మాట్లాడితే బాగోదేమో' అంటూ నే.. తనదైన శైలిలో పై వ్యాఖ్యలు చేశారు.



**మూడో తరం కనిపించడంలేదు..**
విద్యార్థి రాజకీయాల్లో మొదటి తరంలో బూర్గుల రామకృష్ణారావు, పీవీ నర్సింహారావు, మర్రి చెన్నారెడ్డి, రెండో తరంలో జైపాల్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, దత్తాత్రేయ వంటివారు రాణిస్తే.. మూడో తరంలో ఎవరూ కనిపించడం లేదని సీఎం రేవంత్ అన్నారు. యూనివర్సిటీలు ఉనికి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని, వాటికి పూర్వవైభవం కల్పించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపా రు. మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నర్‌గా బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన విద్యాసాగర్‌రావు.. తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ఐదు దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో ఎలాంటి ఆరోపణలు ఎదుర్కొనకపోవడం విద్యాసాగర్‌రావు గొప్పతనమని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరు సలహాలిచ్చినా తీసుకోవడానికి తనకు ఎలాంటి భేషజాలు లేవని, ముఖ్యంగా సాగర్‌జీ వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్‌తోపాటు బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వంటివారు సహకరించాలని కోరారు. జల్లికట్టు సమస్య వస్తే.. తమిళనాడులో అన్ని పార్టీలూ కేంద్రంతో పోరాటం చేసి సాధించుకున్నాయని, తెలంగాణ అభివృద్ధి విషయంలో కూడా అన్ని పార్టీలు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సీహెచ్.విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేయడం, మూసీ పునరుజ్జీవం కోసం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్రపంచదేశాల్లోని ముఖ్యనగరాలకు దీటుగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడం ప్రశంసనీయమని పేర్కొన్నా రు.

**ఉన్నత పదవులకు వన్నె తెచ్చిన విద్యాసాగర్‌రావు: దత్తాత్రేయ**
విద్యాసాగర్‌రావు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసినప్పుడు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయనకు తానే బీ ఫాం ఇచ్చానని అన్నారు. ఎన్నో ఉన్నత పదవులకు ఆయన వన్నె తెచ్చారని ప్రశంసించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకావడం మంచి పరిణామమన్నారు. ఒడిసా గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా జలాల సద్వినియోగం కోసం విద్యాసాగర్‌రావు విశేష కృషి చేశారన్నారు. రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం విద్యాసాగర్‌రావు రాజీ పడకుండా నిలిచారన్నారు. ఈ కారక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

## అగ్ర రాజ్యం.. అసాధ్యం కాదు

మన యువత సామర్థ్యాలతో కచ్చితంగా ఎదుగుతాం: ప్రధాని



**న్యూఢిల్లీ, జనవరి 12:** భారతీయ యువత శక్తిసామర్థ్యాలతో కచ్చితంగా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మనదేశం అగ్రరాజ్యంగా అభివృద్ధి చెందడం కష్టమని కొందరు అంటుంటారని.. కానీ అసాధ్యమైతే కాదని తేల్చిచెప్పారు. 'వికసిత్ భారత్' స్ఫూర్తితో ప్రతి అడుగు, విధానం, నిర్ణయం తీసుకుంటే.. భారత్‌ను ఎవరూ ఆపలేరని తెలిపారు. స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకుని ఆదివారమిక్కడ నిర్వహించిన జాతీయ యువజనోత్సవంలో.. దేశం నలుమూలల నుంచీ వచ్చిన 'వికసిత్ భారత్ యువ నేతల చర్చ'ను ఆయన ప్రారంభించారు. ఏ దేశమైనా ముందుకు సాగడానికి భారీ లక్ష్యాలు పెట్టుకోవాలని, భారత్ ఇప్పుడదే చేస్తోందని ఈ సందర్భంగా అన్నారు. వివిధ రంగాల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలను గడువు కంటే ముందే చేరుకుంటున్నామని చెప్పారు. "1930ల్లో దారుణ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి అమెరికా అగ్రరాజ్యంగా మారింది. కనీస మౌలిక వసతులు కూడా లేని వెనుకబడిన దేశంగా ఉన్న సింగపూర్ ప్రఖ్యాత ఆర్థిక శక్తిగా ఆవిర్భవించింది. భారీ లక్ష్యాలను నిర్దేశించుకుని చిత్తశుద్ధితో వాటిని నెరవేర్చుకునేందుకు కృషిచేయాలని ఈ రెండు ఉదాహరణలు నొక్కిచెబుతున్నాయి. బహిరంగ మలవిసర్జన దేశంగా మారాం. కొవిడ్ వ్యాక్సిన్లు ఉత్పత్తి చేశాం. ప్రజలందరికీ అందించాం. వచ్చే దశాబ్దంలో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశిస్తున్నాం. ఈ దిశగా పూర్తి అంకితభావంతో పనిచేస్తున్నాం. వచ్చే దశాబ్దంలో మన ఎకానమీ రూ.10 లక్షల కోట్లకు చేరుతుంది. 2047 వరకు ఈ పాతికేళ్లూ మన దేశానికి స్వర్ణయుగం (అమృతకాలం). మన యువత వికసిత్ భారత్ కల నెరవేరుస్తారని నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది' అని మోదీ తెలిపారు.

## నేటి నుంచే మహా కుంభమేళా!

45 రోజుల పాటు నిర్వహణ.. కోట్లాదిగా రానున్న భక్తులు

విస్తృత ఏర్పాట్లు చేసిన యూపీ.. ఏఐ సాంకేతికతతో దిశా నిర్దేశం

**ప్రయాగ్‌రాజ్, జనవరి 12:**



మహా కుంభమేళా సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తు న్న ఈ మహాకుంభ మేళా మొత్తం 45 రోజుల పాటు సాగనుంది. పుష్య పౌర్ణమి ని పురస్కరించుకుని సోమవారం తొలిపుణ్యస్నానంతో ఈ మహా క్రతువుకు యూపీ సర్కారు శ్రీకారం చుట్టనుంది. గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతంలో నిర్వహించే మహా కుంభమేళాకు దేశ, విదేశాల నుంచి దాదాపు 35 కోట్ల మంది ప్రజలు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసింది.

## ఏడాదిలో రైతు సంక్షేమానికి 40వేల కోట్లు

26 నుంచి 4 సంక్షేమ పథకాల అమలు: తుమ్మల

**నల్లగొండ టౌన్, జనవరి 12:**



ప్రజా ప్రభుత్వంలో ఒక్క సంవత్సరం కాలంలోనే రైతు సంక్షేమం కోసం రూ.40వేల కోట్లు ఖర్చు చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఎమ్మెల్యేలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల మంజూరు లాంటి పథకాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ రెవెన్యూ గ్రామాల వారీగా రికార్డులు పరిశీలించాలని సూచించారు. ఆర్వోఎఫఆర్ పట్టాలు ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

## వచ్చే నెల నుండే పేదలకు సన్న బియ్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు - వ్యవసాయ భూములకు రూ. 12 వేల రైతు భరోసా
- దేశంలోనే ప్రధమంగా రైతు కూలీలకు ఆత్మీయ భరోసా - అభివృద్ధి సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రులు

**కరీంనగర్, జనవరి, 12**
పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు చరిత్రలో నిలిచిపోను న్నాయని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి పథకాల అమలుపై ఆదివారం స్థానిక కలెక్టర్ లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళిక, సమీక్ష సమావేశానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్న ఉద్దేశంతో సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి యోగ్యమైన భూమికి పంట వేసినా, వేయకపోయినా సంవత్సరానికి రూ.12000 రైతు భరోసా ఇవ్వనున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.7500 కోట్ల రైతు భరోసా సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతు భరోసా పథకం అమలుపై క్యాబినెట్ సబ్ కమిటీ వేసి అన్ని జిల్లాలు పర్యటించి విధివిధానాలు రూపొందించామని తెలిపారు. రహదారులు, రియల్ ఎస్టేట్ స్థలాలు, సాగుకు యోగ్యంలేని భూములకు రైతు భరోసా ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000 ఇస్తామని తెలిపారు. వ్యవసాయ కూలీలు గత సంవత్సరంలో కనీసం 20 రోజులపాటు ఉపాధి హామీ పథకం పని చేసి ఉండాలని తెలిపారు. వ్యవసాయ కూలీలకు ఈ స్థాయిలో ఆర్థిక సాయం స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నడూ, ఎక్కడా అందలేదని వివరించారు. తెలంగాణలో గత ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు 90 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉండేవని, అధికారంలోకి వచ్చాక కేవలం 49వేల



కొత్త కార్డులు మాత్రమే జారీ చేశారన్నారు. తమ ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని, ఎంతమంది అర్హులయితే, అంతమందికి రేషన్ కార్డులు ఇస్తామన్నారు. కొత్తగా కుటుంబ సభ్యులను కూడా రేషన్ కార్డులలో చేరుస్తామని అన్నారు. ఈనెల 26 నుండి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. తినడానికి యోగ్యం లేని బియ్యాన్ని ఇవ్వడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతు న్నాయని తెలిపారు. అందువల్ల రేషన్ బియ్యం పంపిణీలో విప్లవాత్మక మార్పును తీసుకొస్తున్నామని తెలిపారు. వచ్చే నెల నుండి రేషన్ కార్డు ద్వారా 6 కిలోల సన్నబియ్యాన్ని అందజేస్తామని వివరించారు. రూ. 22,500 కోట్లతో ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. మొదటగా ఇంటి స్థలం ఉండి ఇండ్లు లేనివారికి ఈ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. రాష్ట్రవ్యా ప్తంగా నాలుగున్నర లక్షల ఇండ్లు మంజూరు చేయబో తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మధ్యలో వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీరు వాడకుండానే రాష్ట్ర వ్యాప్తంగా ఈ వానాకాలంలో 66.7 లక్షల ఎకరాల్లో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పం డిందన్నారు. ఎటువంటి కటింగు, కోత లేకుండా పౌరసరఫరాల శాఖ ద్వారా విజయవంతంగా ధాన్యా న్ని కొనుగోలు చేశామని వివరించారు. దొడ్డు వడ్లు విక్రయించిన రైతులకు మూడు రోజుల్లోనే ధాన్యం సొమ్ము చెల్లించామని తెలిపారు. సన్న వడ్లకు మరో రూ. 500 బోనస్ అందజేశామని వివరించారు. ఏడాది కాలంలో 55 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. 22 వేల 500 కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రొండ్లవాగు, పత్తిపాక, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని అన్నారు. నీటి లభ్యత ఉన్న ఏ సాగునీటి పథకాన్ని అయినా ప్రభుత్వం అమలు చేస్తుందని స్పష్టం చేశారు. పథకాల అమలుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు.



## 90 గంటల పనిపై యువత ఆలోచించాలి!

సెలవుల గురించి ఎక్కువగా ఆలోచించకూడదు

'క్వాంట పీపుల్' కార్యక్రమంలో డీజీపీ జితేందర్

**రాంగోపాల్‌పేట్, జనవరి 12:** "భారతీయులు వారానికి 90 గంటలు ఎందుకు పని చేయరని ఓ పారిశ్రామికవేత్త అన్నారు. ఇది నేటి యువత బాగా ఆలోచించాల్సిన విషయం" అని డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు.

వారానికి 5-6 రోజులు పనిచేస్తామని అనకూడదని.. ఎక్కువగా సెలవుల గురించి ఆలోచించకుండా మెక్ డొనాల్డ్స్, స్విగ్గీ, జోమాటో, డబ్బావాలా వంటి నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. అలాంటివారిని కార్పొరేట్ కంపెనీలు ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆదివారం టీఎంఐ కార్పొరేట్



కార్యాలయంలో జరిగిన 'క్వాంట పీపుల్' పేరిట టీఎంఐ నెలకొల్పిన స్టార్టప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముంబైకి చెందిన 12 ఏళ్ళ బాలుడు లాజిస్టిక్ యాప్ తయారుచేసి డబ్బావాలతో టై-అప్ అయ్యాడని.. రెండేళ్లలో దాని టర్నోవర్ రూ.200 కోట్లకు చేరుకున్నట్టు ఇటీవలే ఒక పత్రికలో చదివానని గుర్తుచేసుకున్నారు.

కార్పొరేట్ కంపెనీలు యువతను ప్రోత్సహించి అలాంటి ఆవిష్కరణలకు చేయూతనివ్వాలని సూచించారు. ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేష్ కుమార్, టీఎంఐ సిటీవో సమీర్ గోస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

## డీ లిమిటేషన్ అన్యాయాలపై

# చర్చ మొదలవ్వాలి !

**తొలి సమయం హైదరాబాద్,**

దేశ జనాభాకు అనుగుణంగా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు ఎప్పుడో పెరగాల్సి ఉంది. కానీ ఈ సీట్లు పెరగడం లేదు. సరికదా కేంద్రంలో పాలన చేసిన పార్టీలన్నీ కాలయాపన చేస్తూ వచ్చాయి. సీట్లు పెరిగితే తమకు ఎక్కడ ముప్పు వస్తుందో అన్న ఆలోచనలో పాలక పార్టీలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన కత్తి మీద సాములాంటిది. ఇది ఎన్నో కీలక రాజకీయ పరిణామాలకు దారి తీసే అవకాశం ఉంది. దీనికితోడు జనాభా కూడా పాపం పెరిగినట్లు పెరుగుతోంది. జనాభా కంట్రోల్ చేయడంలో కొన్ని రాష్ట్రాలు బాగా కృషి చేస్తుంటే..బీహార్, బెంగాల్ వంటి రాష్ట్రాలు అస్సలు పట్టించుకోవడం లేదు. అంతెందుకు గణాంకాల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. దక్షిణాదిలో జనాభా నియంత్రణ కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. ఈ క్రమంలో అక్కడ డీలిమిటేషన్ జరిగితే అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఇతర రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో కృషి చేస్తున్న తమకు అన్యాయం జరిగేలా ఉందని ఇటీవల తెలంగాణ మంత్రి కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాకుండా దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పంపిణీలో అన్యాయం జరుగుతుందని కూడా అన్నారు. నిజంగానే ఇది ఆలోచించాల్సిన విషయం. కేరళ లాంటి రాష్ట్రాలు అక్షరాస్యత,జనాభా నియంత్రణలో ముందున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే దేశ జనాభా 140 కోట్లకు చేరినందున వారికి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించే వారి సంఖ్య కూడా పెరగాలని కోరుకుంటున్నారు. అందుకే జనాభా ప్రాతిపదికన విభజించి 846 నియోజకవర్గాలు చేయాలన్న ఆలోచన ఉంది. అలా చేస్తే.. ఒక్క యూపీకే 143 లోక్ సభ సీట్లు వస్తాయి. మొత్తం దక్షిణాదికి 160 వరకూలోక్ సభ సీట్లు ఉంటాయి. అంటే... మొత్తం దక్షిణాది అంతాకూడా యూపీతో పోటీపడదన్న మాట. దీంతో పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోవడం ఖాయం అన్న ఆందోళన మరోవైపు వెన్నాడుతోంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల పునర్వి భజనకు జనాభాను ప్రాతిపదికగా తీసుకోకూడదని డిమాండ్ చేస్తున్నాయి. దేశంలో జనాభాను నియంత్రించడంలోనే కాకుండా మానవ అభివృద్ధి సూచికల్లో కూడా దక్షిణాది రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. జనాభా లెక్కల ఆధారంగా చేసే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కత్తి దక్షిణాది రాష్ట్రాలపై వేలాడుతోంది. మహిళా రిజర్వేషన్‌బిల్లు ఆమోదించిన తరువాత జరిగే తొలి జనగణన తరువాత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి.. మహిళా రిజర్వేషన్‌లను అమలు జరుపుతామని లోక్‌సభలో కేంద్రం ప్రకటించింది. దీంతో.. మళ్లీ నియోజక వర్గాల పునర్విభజన అంశం తెరమీదకు వచ్చింది. జనాభానే ప్రాతిపదికగా తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని ఇప్పటికే అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఎంపీ స్థానాలకు 1971 నాటి జనగణన ప్రాతిపదిక. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు ప్రస్తుతం 129 లోక్‌సభ స్థానాలున్నాయి. జనాభా లెక్కలు తీసిన తర్వాత పునర్విభజనలో వీటి సంఖ్య 103కు పడిపోతుంది. ఉత్తరాదిలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య పెరుగుతుంది. ప్రస్తుతం ఈ నాలుగు రాష్ట్రాల్లోని లోక్‌సభ స్థానాల సంఖ్య 174 కాగా పునర్విభజనతో వీటి సంఖ్య ఏకంగా 204 స్థానాలకు చేరుకుంటుంది. పశ్చిమబెంగాల్, ఒడిషా కూడా భారీగా నష్టపోతాయి. ప్రసుతం ఈ రెండు రాష్ట్రాలకు కలిపి 42 లోక్‌సభ స్థానాలుంటే.. కొత్తగా జరిగే పునర్విభజన తరువాత వాటి సంఖ్య 34కు పడిపోయే అవకాశం ఉంది. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు జరిపినందుకు దక్షిణాది రాష్ట్రాలు దారుణంగా నష్టపోతుండగా.. జనాభా నియంత్రణలో పూర్తిగా విఫల మై.. జనభా విస్ఫోటంతో నానా అవస్థలు పడుతున్న ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం లబ్ధి పొందడం దారుణం కాకా మరోటి కాదు. ఇదే విషయాన్ని కెటిఆర్ లెక్కలతో సహా వివరించి..జరుగబోతున్న నష్టాన్ని ప్రజల ముందుంచారు. దక్షిణాది రాష్ట్రాల నేతలు కూడా ఇదే విషయంపై మండిపడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజ నకు కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకూడదని ఈ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్ కూడా ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజ నలో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని హామీ ఇవ్వాలంటూ తమిళనాడు సిఎం స్టాలిన్ ప్రధాని మోడీని డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల బిల్లును తీసుకు వచ్చిన సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన తరవాత అమలు చేయడం అని అందులో షరతు పెట్టింది. దీంతో ఈ నియోజకవర్గాల పునర్విభజన తెరపైకి వచ్చింది. ఇదే జరిగితే దక్షిణాది పరిస్థితి ఏమిటన్నదానిపై చర్చలు ప్రారంభమయ్యాయి. దేశంలో జనాభా పెరిగిపోతోందని జనాభా నియంత్రణను మన ప్రభుత్వాలు చేపట్టాయి. జనాభాను నియంత్రించిన వారికి ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు మెరుగ్గా ఉన్నాయి. ప్రజలు చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఫలితంగా దక్షిణాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గింది. అభివృద్ధిలో ముందుకు వెళ్లింది. కానీ ఉత్తరాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గలేదు... అక్కడి ప్రజలు జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు జనాభా ప్రకారం డీలిమిటేషన్ జరిగితే.. నష్టపోయేది దక్షిణాది. లాభపడేది ఉత్తరాది. ఈ అన్యాయన్ని ఎలా సరిచేస్తారన్నదే ఇప్పుడు దేశం ముందున్న ప్రశ్న.

# పెరిగిన ధరలు.. ద్రవ్యోల్బణం కట్టడికి మార్గాలేవీ



**న్యూఢిల్లీ :** దేశంలో ఆహార పదార్థాల ధరలు మిగతా నిత్యావసరాల ధరలకన్నా అధికంగా పెరుగుతు న్నాయి. ఈ ఏడాది జులైలో అన్ని వస్తువుల ద్రవ్యోల్బణం మొత్తంగా 7.44 శాతం ఉంది. ఆహారధాన్యాలు, కాయగూరలు, పాల ఉత్పత్తులు, తదితర ఆహార పదార్థాల ధరల ద్రవ్యోల్బణం విడిగా చూస్తే 11.5 శాతం ఉంది. టమాటా వంటి కొన్నింటి ధరలు అసాధారణంగా పెరిగినందువలన వాటిని అధికంగా సరఫరా చేసేవిధంగా కొన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంది. దాని వలన ఆగస్టులో ఈ ద్రవ్యోల్బణం 10 శాతానికి చేరువలోకి వచ్చింది. మొత్తం ద్రవ్యోల్బణం కూడా 6.83 శాతానికి తగ్గింది. అయినప్పటికీ వినిమయ వస్తువుల ధరల పెరుగుదల, అందునా ఆహార ధరల పెరుగుదల ఇంకా ఒక తీవ్ర సమస్యగానే ఉంది. ఆహార ధరలు ఇలా వేగం గా పెరిగిపోతూ వుండడం అనేది కేవలం భారత దేశ సమస్యగా మాత్రమే లేదు. మూడవ ప్రపంచ దేశాలన్నింటితోబాటు సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో సైతం ఇది సమస్యగానే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా తలెత్తిన ధోరణి ఇది. మామూలుగా అందరూ దీనికి ఉక్రెయిన్ యుద్ధం కారణం అంటున్నారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా కొరత ఏర్పడిన మాట వాస్తవమే. కాని, ఇప్పుడు మనం చూస్తున్న ద్రవ్యోల్బణం యుద్ధం వలన వచ్చిన కొరత కన్నా, కొరత ఏర్పడబోతోందన్న ముందస్తు అంచనా ఫలితంగా వచ్చింది. యుద్ధం వచ్చిన తర్వాత వాస్తవంగా ఆహార ధాన్యాల సరఫరాలో కొరత ఇంకా ఏర్పడక ముందే ప్రపంచంలో ఆహార ధాన్యాల వ్యాపారంలో లాభాల రేటు చాలా దేశాల్లో పెరిగింది. ఇందుకు అనేక దాఖలాలు ఉన్నాయి. దీనిని బట్టి రాబోతున్న ఆహారధా న్యాల కొరతను దృష్టిలో ఉంచుకుని గుత్త వ్యాపార సంస్థలు ముందుగానే వాటి ధరలను పెంచేశారని స్పష్టమవుతోంది. మన దేశంలో కూడా ఇదే జరిగింది. అందుకే చాలామంది 'ద్రవ్యోల్బణం మీద ముందస్తు అంచనాలు' ధరల పెరుగుదలకు దోహదం చేశాయని అంటున్నారు. ఆహారధాన్యాల ధరలను నియంత్రించడానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది, ప్రభుత్వం ద్రవ్య విధానాన్ని తగువిధంగా మార్పు చేయడం. ఇందులో వడ్డీ రేట్లను పెంచడం, రుణ లభ్యతను అదుపు చేయడం అనే రెండు చర్యలు ఉంటాయి. పాత రోజుల్లో ఇటువంటి సందర్భాలలో ఆహారధాన్య వ్యాపారులకు మాత్రమే రుణ లభ్యతను అదుపు చేసేవారు. దాని ఫలితంగా వారు ఎక్కువ నిల్వలను ఉంచుకోవడం సాధ్యపడేది కాదు. అప్పుడు ఆహారధాన్యాల ధరలు తగ్గేవి. కాని ప్రస్తుత నయా ఉదారవాద కాలంలో కొన్ని తరగతుల వ్యాపారులకు మాత్రమే నియంత్రణ అమలు చేయడం సాధ్యం కాదు. అందుచేత అందరికీ రుణ లభ్యతను అదుపు చేయాల్సి వుంటుంది. దీని వలన చిన్న, మధ్య తరహా పెట్టుబడిదారులు ఎక్కువగా దెబ్బ తింటారు. అది నిరుద్యోగం మరింత పెరగడానికి దారి తీస్తుంది. దాని వలన ప్రజల కొనుగోలు శక్తి మొత్తం మీద చూసినప్పుడు తగ్గిపోతుంది. అంటే ఆహారధాన్యాలకు డిమాండ్ తగ్గుతుంది. దానివలన ద్రవ్యోల్బణం తగ్గుతుంది. నయా ఉదారవాదం ద్రవ్యోల్బణానికి చూపించే పరిష్కారం ఇదే. రెండో పద్ధతి ఏమిటంటే, ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించడం. అప్పుడు ప్రభుత్వం దగ్గరున్న నిల్వలు బహిరంగ మార్కెట్ లోకి కాకుండా నేరుగా ప్రజలకు చేరుతాయి. అప్పుడు నిల్వలు స్పెక్యులేటర్లకు అందుబాటులోకి లేకుండా పోతాయి. వినియోగదారులు బహిరంగ మార్కెట్ నుండి ప్రజా పంపిణీ వ్యవస్థ వైపు మరలుతారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించి ఎక్కువ ఆహారధాన్యాలను ప్రజలకు అందించాలంటే అప్పుడు ప్రభుత్వం ఎఫ్‌సిఐ ద్వారా మరింత ఎక్కువగా ఆహారధాన్యాల సేకరణకు పూనుకోవలసి వస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో 5 కోట్ల 21 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించాలని నిర్ణయించింది. ఈ పని చేస్తే తప్ప ప్రస్తుత ఆహారధా న్యాల ధరల పెరుగుదలను నియంత్రించడం సాధ్యం కాదు. ఎంతో అపఖ్యాతిని ఆర్జించిన నల్ల వ్యవసాయ చట్టాలు ఎంత పనికిమాలినవో ఇప్పుడు బాగా బోధపడుతుంది. రైతులంతా ఉద్యమించి ఆ చట్టాలను రద్దు చేసేవరకూ పోరాడారు గనుక సరిపోయింది. అలా కాకుండా, ఆ చట్టాలే అమలులో ఉండిన్లటైతే మొత్తం దేశంలోని ఆహార ధాన్యాలన్నీ ప్రైవేటు రంగం గుప్పెట్లో ఇరుక్కుపోయి వుండేవి. అప్పుడు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం ప్రభుత్వానికి అసాధ్యం అయివుండేది. రైతుల పోరాటం ఈ దేశాన్ని కాపాడింది. అందువల్లే ప్రజా పంపిణీ వ్యవస్థ ఇంకా బతికి ఉంది!!

# గగ్గోలు పెడితే..అబద్ధాలు నిజాలు కావు !

**తొలి సమయం హైదరాబాద్,**

తప్పు చేయలేదు..కానీ వేలకోట్ల ఆస్తులు మాత్రం సమకూరాయి. భూములన్నీ హాంఫట్ అయ్యాయి. ధరణి పేరుతో పేదలను జలగల్లా పీల్చారు. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేశారు. సిరిసిల్లలో 2500 ఎకరాల ప్రభుత్వ భూమి అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టారు. ఇదంతా యువరాజా వారు కెటిఆర్ అవినీతిపై పుంఖానుపుంఖాలుగా వస్తున్న ఆరోపణలు. చెల్లెలు కవితమ్మ కూడా అవినీతి చేయలేదు. కానీ లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కుని జెయిల్‌కు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. చూస్తుండగానే కాళ్లకుచెప్పులు లేని వారు కోట్లకు పడగలెత్తారు. తెలంగాణలో వీరి కుటుంబం కోట్లకు పడగలెత్తింది. దీనికి సమాధానం లేదు. ఇప్పుడుఫార్ములా-ఇ రేస్ కేసు మలుపుల మీద మలుపులు తిరుగుతూ పవర్‌ఫుల్ యాక్షన్ మూవీని తలపిస్తోంది. మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫార్ములా-ఈ రేస్ కేసు రచ్చ రేపుతోంది. ఫార్ములా-ఈ రేస్ కేసులో పైసావంతు కూడా అవినీతి జరగేలదని కెటిఆర్ వాదిస్తున్నారు. 55 కోట్లు మాత్రం ఇచ్చేశానంటున్నాడు. ఓ మంత్రిగా, ఎవరి అనుమతి లేకుండా ఇంత పెద్దమొత్తంలో డబ్బులు ఎందుకు దాటవేశారన్నదానికి సమాధానం చెప్పడం లేదు. అవినీతి జరరగలేదు. ఏం చేసుకుంటారో చేసుకోండని, వెయ్యి కేసులు పెట్టినా భయపడేది లేదన్న వాదనతో కెటిఆర్ అబద్దాన్ని నిజం చేయాలని చూస్తున్నారు. ఇక్కడ అనుమతులు లేకుండా మంత్రిగా ఇంత డబ్బును విదేశాలకు ఎలా తరలించారన్న దానిపైనే కేసు పెట్టారు. కానీ దీనికి కెటిఆర్ ఇప్పటికీ సూటిగా సమాధానం చెప్పడం లేదు. సుప్రీంకోర్టు దాకా వెళ్లి క్వాష్ పిటిషన్లు మాత్రం వేస్తున్నారు. అబద్దాలు ఆడేవారికి అరుపులు ఎక్కువ అన్నట్లుగా ఉచ్చనీచాలు మరచి ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేస్తున్నారు. కాళేశ్వరం అవినీతి అబద్ధమా..ధరణి అక్రమాలు అబద్ధమా...సిరిసిల్ల భూముల పందేరం అబద్ధమా...ఫార్ములా కేసులో 55 కోట్లు దాటించింది అబద్ధమా.. అన్నది మాత్రం చెప్పడం లేదు. నోరుంది కదాని, రాయడానికి, వినడానికి కొందరు ఉన్నారు కదాని పదేళ్ల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు నానాయాగీ చేస్తున్నారు. ఎసిబి విచారణను తప్పుపడుతున్నారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే..అరెస్టును నిలుపుదల చేయాలన్న కేటీఆర్ అప్పీల్ కూడా తిరస్కరణకు గురైంది. ఈ క్రమంలో కేటీఆర్‌కు మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు రావాలని ఈడీ అధికారులు నోటీసుల్లో తెలిపారు. నాపై అక్రమ కేసు పెట్టారని, ఇది రాజకీయ ప్రేరేపిత లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కేసులో అసలు పసలేదని భావిస్తే...హైకోర్టు క్వాష్ పిటిషన్ ఎందుకు కొట్టేసినట్లు..కెటిఆర్ సమాధానం చెప్పాలి. ఎసిబి విచారణ చేయవచ్చని కూడా చెప్పింది. అవినీతిపరులకు అంతా అవినీతే కనిపిస్తుందని ఆరోపించి నంత మాత్రాన కెటిఆర్ అవినీతి వ్యవహారం నుంచి తప్పించుకోలేరని గుర్తించాలి. అధికారం అడ్డుపెట్టుకుని అక్రమకేసు పెట్టారని ఆరోపిస్తున్న కెటిఆర్...అదే అధికారం అడ్డం పెట్టుకుని పదేళ్ల పాటు విచ్చలవిడిగా చేసిన అక్రమాలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదు.నేనెలాంటి తప్పూ చేయలేదని, నాకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది... సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తా... జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో చర్చకు సిద్ధం...ఏసీబీ, ఈడీ విచారణకు కూడా హాజరవుతా ..అంటున్న కేటిఆర్ పదేపదే కోర్టు మెట్లు ఎక్కాలని ఎందుకు చూస్తున్నారో చెప్పాలి. ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తేవాలని ఫార్ములా ఈ-కార్ రేస్‌ను నిర్వహించామని, దాని నిర్వహణకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలకు మంత్రి హోదాలో సంతకాలు చేశానని ఏసీబీ అధికారుల ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చినట్టు సమాచారం. అయితే ఆర్థిక అనుమతులు లేకుండా ఎందుకు డబ్బును దాటించారన్న దానికి సూటిగా సమాధానం చెప్పడం లేదు. డొకతిరుగుడు మాటలు మానేసి డబ్బులు ఎందుకు దాటించారో చెప్పాలి. కానీ దీనికి సమాధానం లేదు. ఈ ఫార్ములా ఆగిపోవడంతో హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతిన్నదని గగ్గోలు పెడితే చెవిలో ఎవరూ పూలు పెట్టుకోలేదని గుర్తించాలి. ముఖ్యంగా క్యాబినెట్ ఆమోదం లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారనే అంశం గురించి ప్రశ్నిస్తుంటే..ఇంతవరకు కెటిఆర్ లేదా ఆయన అనుచర గణం సమాధానం ఇవ్వండ లేదు. ఈ ఒక్క కేసే కాదు వంద కేసులు పెట్టినా పోరాటం ఆపబోమని, ప్రతినిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటామని అహంకార పూరిత ప్రకటనలు చేసినంత మాత్రాన అవినీతి కేసులు ఆగిపోవు. నేను ఎలాంటి తప్పూ చేయలేదు.. ఎవరికీ తలవంచేది లేదు అని ప్రజలు ఎంతోకాలం మభ్య పెట్టలేమని కెటిఆర్ గుర్తిస్తే మంచిది. ఫార్ములా ఈ రేస్‌లో ముఖ్యమంత్రి డైరెక్షన్‌లోనే ఏసీబీ విచారణ చేపట్టిందని వాదించడం ద్వారా కెటిఆర్ తన పార్టీ వాళ్లకు నమ్మకం కలిగించవచ్చు..కానీ ప్రజలకు, ఎసిబికి నమ్మకం కలిగించలేరు. ఏసీబీ కేసులో పసలేదనే విషయం కేసు పెట్టినవారికి కూడా తెలుసంటూ ఇంకా బుకాయింపులు ఎందుకో కెటిఆర్ గారు చెప్పాలి. పస ఉందా లేదా అన్నది వారు విచారణలో తేలుస్తారు. అప్పటి వరకు కొంచెం ఓపిక పట్టాలి. అవినీతి కేసులు ఒక్కొక్కటి బుసకొడుతూ బయటకు వస్తుంటాయి. సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్‌తోపాటు, హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేటీఆర్‌ను ఎసిబి ప్రశ్నిస్తోంది. రేసు రద్దు వల్ల జరిగిన నష్టానికి ముఖ్యమంత్రి పైన కూడా కేసు నమోదు చేయాలనే వితండవాదన కూడా కెటిఆర్ తెరపైకి తెచ్చారు. రేసుల వల్ల ఇమేజ్ పెరిగితే గుర్రాలు, పత్తాల రేసులు కూడా పెట్టుకోవచ్చు. ఇక రేసులతో ఏమైనా చేయవచ్చనే మూర్ఖవాదన నుంచి కెటిఆర్ బయటపడితే మంచిది. అవినీతి ఎవరు చేసినా శిక్షార్హులే. అందుకు కెటిఆర్ కాదు..మరెవరూ అతీతం కాదని గుర్తించాలి.

## లొట్టపీసు కేసులో కెటిఆర్ అరెస్ట్ అయితే..?

### పార్టీని ముందుకు తీసుకెళ్లేదెవరో..

**హైదరాబాద్,జనవరి12:** బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్ కుటుంబ సభ్యులు, బంధువుల పార్టీ అన్నది జగమెరిగిన సత్యం. పార్టీ అంతా కెసిఆర్, కెటిఆర్, కవితల ఆధ్వర్యంలో నడుస్తుంది. పైకి హరీష్ రావు కనిపిస్తున్నా..ఆయనది నిమిత్తమైన పాత్ర. ఆయన గగ్గోలు బ్యాచ్‌లో ఉంటారు. అందుకే కేటీఆర్‌పై కేసు నమోదు కాగానే అడ్డదిడ్డమైన వాదనలు, అరుపులతో గగ్గోలు పెట్టాలని చూశారు. మొత్తంగా గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలుగా పనిచేసి వారంతా వచ్చి తమ సానూభూతి ప్రకటించి, దారాన్ని తాడులా పేనినట్లుగా ఒక్కటి కావాలనే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో భూకంపం వచ్చిందన్న భ్రమలు కలగించే పరిస్థితి ఉన్నట్లుగా చూపిస్తున్నారు. ఈ క్రమంలో కెసిఆర్ ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావడం లేదు. ఒకవేళ కెటిఆర్ అరెస్ట్ అయితే పార్టీని ఎవరు నడిపిస్తారన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే నేరుగా హరీష్ రావు చేతిలో పగ్గాలు పెట్టడం ఆ ఇంటి పెద్దలకు ఇష్ట లేదు. కెటిఆర్ పరోక్షంలో బీఆర్ఎస్ పార్టీని ఎవరు నడిపించాలనే దానిపై కేసీఆర్ కూడా చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. ఫార్మూలా ఈ రేస్ కేసులో ప్రభుత్వం వద్ద ఇప్పటికే అనేక బలమైన సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఈ కేసు ఊరికే ముగిసేది కాదు. దర్యాప్తు జరుగుతూ పోతుంటే, మరిన్ని కొత్త విషయాలు బయటకు వచ్చేట్లున్నాయి.

# బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కార్యాలయం ఏర్పాటు




**తొలి సమయం మహబూబాబాద్ జనవరి 12:**
జిల్లా కేంద్రంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కార్యాలయం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పాత కల్లు కాంపౌండ్ ఎదురుగా (సాయినాద్ జ్యువలరీ ఎదురుగా) ఉన్న బిల్డింగ్ నందు 2వ అంతస్తులో ప్రారంభించారు, ముఖ్య అతిధిగా బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ గౌడ్, పాల్గొన్నారు,జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్,. అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి కొడుపుగంటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ల విష్ణు ఆధ్వర్యంలో ,రిబ్బన్ కట్ చేసి జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమం లో గౌడ సంఘాల JAC కన్వీనర్ సమ్మెట వెంకన్న గౌడ్,గౌరవ సలహాదారులు, బిక్కి వెంకటేశ్వర్లు గౌడ్ ముత్యం వెంకన్న గౌడ్,తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు జెరిపోతుల వెంకన్న గౌడ్,కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ, చిన్న గూడూరు మండల అధ్యక్షులు గునిగంటి కమలాకర్ గౌడ్,ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శి రమణబోయినా వీరన్న, యాదవ సంఘం జిల్లా కార్యదర్శి వాళ్ళలా శ్రీనివాస్ యాదవ్,పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు, వేముల వెంకన్న, మహిళ అధ్యక్షులు చెన్నూరి విజయలక్ష్మి,, రజక సంఘం టౌన్ బాధ్యులు నిమ్మని శ్రీనివాస్,జిల్లా వివిధ కుల సంఘ బాధ్యులు ఈ కార్యక్రమం లో పాల్గొని మహాత్మా జ్యోతి బా పూలె, సావిత్రి బా,పూలె, మరియు,%ణతీ.దీ. =% అంబేద్కర్,చిత్ర పాటలకు,పూలమాలవేసి నివ్వాళ్ళు అర్పించారు, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ %దీఎ% లకు చట్ట సభలాల్లో రాజకీయ రిజర్వేషన్ రావాలని, అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం బీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి,బీసీలకు రెండు వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టాలి, తెలంగాణ ప్రభుత్వం బీసీ లకు బీసీల జనాభా ప్రాతిపదిక ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్ ఇవ్వాలని, ఈ మధ్యలో వివిధ వార్తలల్లో కొన్ని తప్పుడు కథనాలు వస్తున్నాయని, బీసీలు 55% శాతం మాత్రమే అని అనే తప్పుడు కథనాలు చెబుతున్నారు,కానీ బీసీల కులగనన్న ప్రకారం 65% శాతం ఉంటారని, వాటి ప్రకారమే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేస్తున్నాము అని అన్నారు, బహుజన రాజ్యం బలపడిందని, రేపు రాబోయేది బీసీ రాజ్యమే అని అన్నారు, ఏ పార్టీలైనా ఇప్పుడు బీసీ వాదమే ఎత్తుకుంటుందని, వాటి ప్రలోబాలకు లొంగకుండా బీసీలందరూ ఐక్యమై బిసి ల రాజ్యాధికారం సాధించేవరకు పోరాడాలి అన్నారు, జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని, జీవో 29 రద్దు చేయాలని, రేపు జరగబోయే స్థానిక సంస్థ ల ఎలక్షన్ లో బీసీలందరూ బీసీలకే ఓట్లు వేయాలని, బిసి రాజ్యాధికార సమితి అందరికీ అండదండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కార్యదర్శి రమణ బోయిన వీరన్న,మరిపెడ మండల అధ్యక్షులు సామకూరి కృష్ణ, నెల్లికుదురు మండల అధ్యక్షులు వారి పెల్లి ఉప్పలయ్య, టౌన్ బాధ్యులు గండి రాజేష్, కోడుపుగంటి వెంకన్న, వాళ్ళలా శ్రీనివాస్, వివిధ మండల బాధ్యులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# బీసీ జర్నలిస్టులకు ఉద్యమాభివందనాలతో..

స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు దాటినా బి.సి ప్రజల బతుకులు బాగుపడలేదు. ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, ఆధిపత్య రాజకీయాల వల్ల గత 30 ఏండ్ల క్రింద స్వాభిమానంతో బ్రతికిన బి.సి లు నేడు బతకలేక బలిదానాలు చేసుకుంటున్న దుస్థితిలో ఉన్నాము. రాజ్యాంగ హక్కులు లేక, రాజకీయ అధికారం లేక ఎందుకు గొరగాని బతుకులు బతుకుతున్నారు. గత 25 ఏండ్లలో వచ్చిన మార్పుల వల్ల మెజార్టీ బి.సి ప్రజలు గ్రామాలు విడిచి నగరాలకు, విదేశాలకు వలసలు వెళ్ళారు. ఉద్యోగాల రీత్యా కొందరు, బ్రతుకుదెరువు కోసం వలసలు పోయిన వారు కొందరు అయితే చాలీ చాలని వేతనాలతో కొనసాగుతున్న బి.సి జర్నలిస్టుల స్థితి చాలా దయనీయంగా ఉంది. బహుజన ప్రజల విముక్తి కోసం గత 25 ఏండ్లుగా ఎన్నో పోరాటాలు చేసిన వారు నేటి బి.సి ప్రజల విముక్తి కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించి 80 సంఘాలతో ఆల్ ఇండియా ఒబిసి జాక్ (%లూ×ాదీజ జీూజ%) ఏర్పాటు చేయడమైనది. చట్టసభల్లో బి.సి వాటా కోసం %లూ×ాదీజ జీూజ% ఆధ్వర్యంలో తెలంగాణలో 400 కిలోమీటర్ల పాదయాత్ర చేయడం జరిగింది. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం నిరంతర కార్యక్రమాలు చేస్తూనే ఉన్నాము. బి.సి హక్కులు, రాజ్యాధికారం కోసం జరిగే పోరాటం కీలక దశకు చేరింది. కానీ బి.సి ప్రజలంతా ఒకే దగ్గర లేరు. ఒకే రీతిగా కూడా లేరు. 100 కులాలుగా, 100 వర్గాలుగా, 100 సంఘాలుగా విడిపోవడమే కాకుండా ఆయా రాజకీయ పార్టీలో ఎలాంటి ప్రాదాన్యత లేకుండా జీవిస్తున్నారు. న్యాయవాదులుగా, ప్రభుత్వ ఉద్యోగస్తులుగా, ప్రైవేట్ ఉద్యోగస్థులుగా, జర్నలిస్టులుగా, డాక్టర్లుగా, అసంఘటిత కార్మికులుగా, వ్యాపారులుగా, రాజకీయ నాయకులుగా తదితర రంగాల్లో విడిపోయి జీవిస్తున్నారు. అలాంటి బి.సి ప్రజలను వారి శాఖల వారీగా ఐక్యం చేయాల్సిన అవసరముంది. ఆ తదుపరి అన్ని వర్గాల నాయకులను ఐక్య సంఘటనగా ఏర్పాటు చేయాలి.

ఇప్పటి వరకు

1. బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరమ్రం
2. బీసీ గౌడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్
3. బీసీ ఆఫీసర్స్ అసోసియేషన్
4. బీసీ పొలిటికల్ ఫోర్స్
5. బీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం
6. బీసీ ప్రైవేట్ ఎంప్లాయిస్ ఫోరం
7. బీసీ డాక్టర్స్ ఫోరమ్
8. బీసీ అడ్వకేట్స్ పురం
9. బీసీ ఉమెన్స్ ఫోరమ్
10. బీసీ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఫోరం
11. బీసీ బిజినెస్ గ్రూప్
12. బీసీ ఉద్యమకారుల గ్రూప్
13. బీసీ ఆర్ఎంపి అసోసియేషన్
14. బీసీ ఆల్ ఇండియా ఓబిసి జాక్

గ్రూపులు/ఆర్గనైజేషన్లు ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతున్నాము.ఆ ప్రయత్నంలో బాగంగా తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులను ఐక్యం చేసి రాష్ట్ర స్థాయిలో బి.సి జర్నలిస్టు ఫోరం ను నిర్మితం చేయాల్సిన అవసరముంది. తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అని శపథం చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసినట్లుగానే బి.సి ల రాజ్యాధికారం కోసం బి.సి జర్నలిస్టులు అనే నినాదంతో ముందుకు సాగాల్సిన అవసరముంది. అందుకోసం రాష్ట్ర స్థాయి కమిటీతో పాటు, జిల్లా మండల స్థాయి బి.సి జర్నలిస్టు ఫోరం లను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఏ ఐఓబీసీ జేఏసీ మీ ముందుకు వస్తుంది. చట్టసభల్లో బి సి వాటా కోసం, కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం, స్థానిక సంస్థల్లో బి సి లకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం, కామారెడ్డి డిక్లరేషన్ లో పొందుపరచిన మిగతా అంశాల అమలు కోసం, కాంగ్రెస్



మ్యానిఫెస్టోలో పొందుపరచిన బి సి అభివృద్ధి పనుల అమలు కోసం జరిగే పోరాటంలో బి.సి జర్నలిస్టులు వెన్నుదన్నుగా నిలబడాల్సిన అవసరముంది. దేశవ్యాప్తంగా కుల జనగణన కోసం దేశవ్యాప్త ఉద్యమం చేయాల్సిన అవసరముంది.త్వరలో తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులను ప్రత్యక్షంగా కలిసి చర్చించే ఆలోచన ఏఐఓబీసీ జేఏసీ చేస్తుంది. బి.సి జర్నలిస్టులు మరింత ఎక్కువ మంది జర్నలిస్టులను ఈ గ్రూప్ లో చేర్చండి. బి.సి జర్నలిస్టులకున్న సమస్యలతో పాటు, బి.సి సమస్యలపై చర్చ చేయండి. చైతన్యం – ఐక్యత – అధికారం కోసం జరిగే పోరులో మీరు ముందుంటారని ఆశిస్తూ

**బి.సి శ్రేయోభిలాషి**
**సాయిని నరేందర్**
**న్యాయవాది**
**రాజకీయ, సామాజిక విశ్లేషకులు**
**వ్యవస్థాపక అధ్యక్షులు బి.సి స్టడీ ఫోరం**
**ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్**
**9701916091**

**ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్‌చే**

# తొలి సమయం క్యాలెండర్ ఆవిష్కరణ

**- ప్రజా స్వామ్య పరిరక్షణ,ప్రశ్నించే గొంతుకగా**

**తొలి సమయం నిబద్ధతతో పనిచెయ్యాలి**

**- ప్రభుత్వవిప్, డోర్నకల్ శాసనసభ్యులు జాటోత్ డాక్టర్ రాంచంద్రు నాయక్**



**తొలి సమయం మహబూబాబాద్ జనవరి12:**
డోర్నకల్ నియోజకవర్గం, కొరివి మండలం, రేకుల తండాలో తొలి సమయం దిన పత్రిక క్యాలెండర్ ను ప్రభుత్వ విప్, డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ రాంచంద్రు నాయక్ ఆవిష్కరణ చేసారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత దిన పత్రిక తొలి సమయం అన్నారు, ఆదరించడం మన కర్తవ్యం అన్నారు, ప్రజా స్వామ్య పరిరక్షణ లో భాగంగా నిత్యం ప్రశ్నించే గొంతుకగా తొలి సమయం ప్రజల కోసం, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. ఎప్పుడు తొలి సమయం పత్రికకు ఆశీస్సులు ఉంటాయని దీవించారు ఈ కార్యక్రమం లోతొలి సమయం చీఫ్ ఎడిటర్ వి అయోధ్య రామయ్య కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరభద్రం గౌడ్, మానుకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్,లీడర్ మేకింగ్ మిషన్ కోర్డినేటర్ బండి శ్రీనివాస్ గౌడ్, నూకల వేణుగోపాల్ రెడ్డి, బండి వెంకట్ రెడ్డి రాము నాయక్ గొల్ల పెల్లి రజినీకాంత్, ఒద్దుల సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# మానుకోట 26వ వార్డ్‌లో ఘనంగా ముగ్గుల పోటీ..

**పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులు**



**తొలి సమయం, మహబూబాబాద్ జనవరి 12:**
మానుకోట మున్సిపాలిటీ 12వార్డ్ లోమాలోత్ బాలు నాయక్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీ జరిగింది. ముఖ్యఅతిదిగా బీజేపీ వర్కింగ్ ప్రసిడెంట్ దారా హిందు భారతి పాల్గొన్నారు మహిళా మణులు పెద్దసంఖ్య లో పాల్గొన్నారు మొదటి బహుమతి దీక్షిత ద్వితీయబహుమతి తబితా ఐదో బహుమతి అనిత మరియు ప్రసన్నలు గెలుచుకున్నారు ఈ కార్యక్రమం లో గడ్డం అశోక్ , వెనమాల అజయ్ జయందర్ నరేష్ సందీప్ ప్రేమ్ రాయుడు భూక్యా లక్ష్మి శ్రీను మాధవి రమేష్ సిపిఐ ఎం ఏల్ పార్టీ నాయకురాలు కృష్ణవేణి టీఆర్ ఎస్ పార్టీ యూత్ లీడర్ మహేష్ మహిళలు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగ సంబరాలు



**తొలి సమయం తొర్రూర్ జనవరి 12**
వందేమాతరం ఫౌండేషన్ లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులకు తమ సొంత వారికి దూరంగా ఉంటూ, మన సాంప్రదాయాలకు సంతోషాలకు దూరంగా ఉండకూడదు అని , భావనతో సంక్రాంతి పండుగ సందర్భంగా ఫౌండేషన్ లోని విద్యార్థులకు సంక్రాంతి పండుగ యొక్క విశిష్టత, మరియు ఈ పండుగ రోజున మనం చేసు కునే తీపి పదార్థాలు, పిండి వంటలు (సకినాలు) పి జెడ్ సి లయన్ ప్రతాపని వెంకటేశ్వర్లు ఆర్థిక సహాయం చే విద్యార్థులకు అందించారు వారిని వారి సొంత ఇంటికి దూరంగా ఉన్నారనే భావనను తొలగించి, సంతోషంగా పండుగ వాతావరణాన్ని లయన్ సభ్యులు కల్పించారు ఈ కార్యక్రమంలో పి డి జి లయన్ రాజేందర్ రెడ్డి, అధ్యక్షులైన నవీన్ కుమార్, కోశాధికారి లయన్ శంకర్ మరియు పి జెడ్ సి లయన్ వెంకటేశ్వర్లు, నిర్వాహకులు వందేమాతరం ఫౌండేషన్ విద్యార్థులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఝాన్సీ రెడ్డి కుటుంబం

**తొలి సమయం తొర్రూరు జనవరి 12**



పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి మరియు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కుటుంబ సమేతంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని నివాసం లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు వారితో అనేక ఈ అంశా లపై చర్చించారు సుదీర్ఘంగా నియోజకవర్గంలోని ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సవాలతో సంక్రాంతి పండుగ జరుపుకో వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి సమస్యలను ప్రధానంగా ప్రస్తావించి వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రి మద్దతు తీసుకున్నామని తెలిపారు.

## డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక తప్పుడు ప్రచారం

**తొలి సమయం దంతాలపల్లి జనవరి 12**



దంతాలపల్లి మండల కేంద్రంలో ఏఎంసీ వైస్ చైర్మన్ దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక దగుల్బాజీ మూట దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. పూటకో మాట మాట్లాడే దగుల్బాజీ మూట బ్లాక్ మెయిల్ చేస్తూన్నారు. పార్టీ అధిష్టానం వద్ద డోర్నకల్ శాసనసభ్యులు రామచంద్రనాయక్ గారికి ఉన్న మంచి పేరును చూసి ఓర్వలేక కొంతమంది పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని అన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద162 వ జయంతి వేడుకలు

**తొలి సమయం కొడకండ్ల జనవరి 12**

భారతీయ జనతా పార్టీ కొడకండ్ల మండల శాఖ పులిగిల్ల ఉపేందర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి మోడపల్లి సోమన్న మాట్లాడుతూఓ యువతా మేలుకో అంటూ కోట్లాది భారతీయులకు స్ఫూర్తిప్రదాత అయ్యాడు ..39 ఏళ్లే జీవించినా భారతజాతికి శాశ్వతమార్గదర్శిగా నిలిచాడు.హైందవ సంస్కృతిని...భారతదేశ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచనలుచెరగులా చాటి విశ్వగురువు అయ్యాడు.'లేవండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకూ విశ్రమించకండి.. లేవండి! మేల్కొనండి!.. మిమ్మల్ని మీరు మేల్కొల్పుకొని ఇతరులను మేల్కొల్పండి! ఇకపై నిద్రించకండి!.. మీరు మరణించే లోపే జీవిత పరమావిధిని సాధించండి..లేవండి!మేల్కొనండి!.. గమ్యం చేరేవరకూ ఎక్కడా నిలవకండి.. ఎప్పటికీ జాగృతంగానే ఉండండి.. బలమే జీవితం, బలహీనతే మరణం.. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్ప మనసున్న యువత ఈ దేశానికి కావాలి.."ఆధునిక యువతపైనే నాకు విశ్వాసం ఉంది.. నేను నిర్మించిన ఆదర్శాన్ని దేశ మంతా వ్యాప్తి చేసేది యువతే.. యువత ముందు బలిష్టులు, జవ సంపన్నులు, ఆత్మ విశ్వాసుల, రుజువర్తనులు కావాలి.. ఇలాంటి వారు వంద మంది ఉన్నా చాలు,ఈ ప్రపంచాన్నే మార్చేయ వచ్చు..' అన్న స్వామీజీ సందేశం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం..భారత దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం జాతి పునర్ నిర్మాణమేనన్నారు



స్వామీ వివేకానంద.. ధర్మాన్ని పాటించమన్నారు.. స్వధర్మం తల్లివంటిదని, పర ధర్మం సవతితల్లి వంటిదని అన్నారు.. ఏ విధంగా చూసినా హిందుత్వమే అన్ని ధర్మాలకన్నా గొప్పదన్నారు..ఆయన బోధనలు చదివితే చాలు,మరే వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదవాల్సిన అవసరం లేదు.. ఆంగ్లకాలమానం ప్రకారం జనవరి 12 స్వామీవివేకానంద జన్మదినం.ఈ సందర్భంగా వివేకుడిని గుర్తు తెచ్చుకుందాం.. ఆయన చూపిన మార్గాన్ని అనుసరిద్దాం.. వారి జన్మదిన సందర్భంగా ఈ రోజును భారత దేశంలో జాతీయ యువజన దినోత్సవం గా నిర్వహించుకుంటామనీ అన్నారు.ఈ కార్యక్రమం లో ఓబిసి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముంజల శ్రీనివాస్ పోలింగ్ బూత్ అధ్యక్షులు ఉప్పల మహేష్ ,బోయిని రామకృష్ణ, ఉపేందర్ ,బోయిన మహేష్ మాసురం ఉపేందర్ కమలాకర్, విశ్వాస్ కార్యకర్తలు యువకులు పాలుగొన్నరు.

## చిన్నారి వేదశ్రీ చెవులు కుట్టుట
# వేడుకకు ఘనంగా కార్యక్రమం



**తొలి సమయం ఇల్లందు జనవరి 12:**

తెలంగాణ రాష్ట్ర మాజీ ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్ తనయా చిరంజీవి వేదశ్రీ చెవులు కుట్టుట వేడుక ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలో ఉసిరికాయపల్లి కోట మైసమ్మ గుడి ప్రాంగణంలో ఘనంగా జరిగింది.ఈ ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషనర్ నినావత్ రాంబాబు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారి వేదశ్రీని ఆశీర్వదించారు. అలాగే, ఇల్లందు డిఎస్పి నువ్వు నా చంద్రభాను, ఇల్లందు మున్సిఫ్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూక్య రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.వీరు చిన్నారి వేదశ్రీని ఆశీర్వదిస్తూ ఆమె ఉజ్వల భవిష్యత్తు కోరుకున్నారు. కార్యక్రమానికి పలువురు అతిథులు, గ్రామస్థులు హాజరై వేడుకను మరింత వాడి వేడిగా మార్చారు. ఈ సందర్భంగా ఉసిరికాయ పల్లి గ్రామస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# ఇరువై ఏడు యేళ్లతరువాత ఒకే వేదికపై కలయిక

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కరీంనగర్, జనవరి 12(**

ఇరువై ఏడు యేళ్లతరువాత ఒకే వేదికపై 1997బి1998 బ్యాచ్ కి సంబంధించిన మిత్రులు ఒకే వేదిక పై కలిశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర చాలా కీలకం, ఆటపాటలు,చిలిపి చేష్టలు, కష్టం, సుఖం ఇలా ఏదైనా కానీ మన వెన్నంటే ఉండి నేనున్నాను అంటూ ధైర్యం చెప్పేది ఒక స్నేహం మాత్రమేనని, ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర కీలకం ఆటలు,పాటలు,చిలిపి పనులు కష్టం, సుఖం ఇలా ఏదైనా కాని మన వెన్నంటే ఉండి నేనున్నాను అంటూ ధైర్యం చెప్పేదే ఒక స్నేహమేనని ఆనందం, బాల్యం, స్మృతులు, కరచాలనాలు,చెమ్మగిల్లిన కళ్ళతో అలింగనాలు గురువుల మందలింపులు తలుచుకుంటూ ఒకసారి వయస్సు మరచి పోయి వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణంలో కోలాహలం మధ్య గుర్తుచేసుకున్నారు.ఈ ప్రాంగణంలో అడుగు పెడుతూనే హెూదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరిస్తూ యోగ క్షేమాలు 40మంది విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో 1997-1998 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పండుగగా మారింది. రెండున్నర దశబ్దాల తర్వాత ఎక్కడెక్కడికో వెళ్ళిన వారు,



ఎక్కడెక్కడో స్థిర పడిన కొందరు,ఉద్యోగాల్లో కొందరు, సహధర్మచరి నిలుగా కొందరు, వివిధ స్తితుల్లో జీవిస్తూ తమ మిత్రులను కలవాలనే కలంపులో ఆనాటి విద్యార్థులైన కొంత మంది విద్యార్థులకు ఆలోచన కలిగింది.ఈ సమ్మేళనంలో తమ గురువుల బోధనలు తమ కుటుంబ పరిస్థితులు నాటి చిలిపి చేష్టలను క్రమశిక్షణ పేరుతో గురువుల దండనలు తలుచుకుంటూ సాగిన పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గురువులను శాలువాలు,మెమెంటో లతో సన్మానించారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆడిన ఆటలు పాటలు అలరించాయి.




## ఫిబ్రవరి 7న లక్ష డబ్బులు వేల గొంతుల
# సభను విజయవంతం చేయండి

**ఆదిలో దేశాన్ని ఏలిన మహా మాదిగలం**

**వర్గీకరణ అమలుకై మాదిగలంతా ఏకంకండి**

**కాంగ్రెస్ ప్రభుత్వంతో తాడోపేడో తెలుసుకుందాం**

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఈర రమేష్ మాదిగ**

**ఎల్కతుర్తి / జనవరి 12**

ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో కనకన కంజర డబ్బుల మోతతో వాడవాడ తిరుగుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్ మహానగరంలో జరగబోయే వేల గొంతులు లక్ష డప్పుల ప్రదర్శనకై ప్రతి ఒక్కరు డప్పుతో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ చింతలపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు బొంకూరి సదానందం ఆధ్వర్యంలో భారీగా ర్యాలీ తీసిన మాదిగ కళాకారులు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చినటువంటి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఈర రమేష్ మాదిగ మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో మాదిగల యొక్క చిరకాల కోరిక వర్గీకరణ దేశ ఉన్నత న్యాయస్థానము సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యులతో వేసిన కమిటీ దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్సీల యొక్క సమస్యలను వాదన పరిశీలిన అనంతరం ప్రతి రాష్ట్రంలో అమలు చేసుకోవచ్చని 6:1 తీర్పునిచ్చిన ధర్మసనం దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఎస్సీలను వర్గీకరించుకో వచ్చు తీర్పునిచ్చినప్పటికీ దేశంలో వర్గీకరణ అమలు చేస్తామని మొదటిగా తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేసి తీరుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న విధానానికై ఈనెల హైదరాబాద్ మహానగరంలో ఫిబ్రవరి 7న వేల గొంతులు లక్ష డప్పుల మహాసభకు ప్రతి గ్రామం నుండి 30 మందికి తగ్గకుండా స్వచ్ఛతంగా డప్పు పట్టుకొని సభను విజయవంతం చేయాలని కోరారు ఫిబ్రవరి 7 లోపు అమలు చేస్తే ప్రభుత్వానికి కృతజ్ఞతగా డప్పుల ప్రదర్శన ఉంటుందని లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చావు డబ్బుల మోత మూగ బోతుందని అన్నారు ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా ఎస్సీలను జనాభా దామాషా ప్రకారము ఏ బి సి డి లు గా అమలు చేయాలని డిమాండ్ చేశారు అనంతరం హైదరాబాద్ మహానగరంలో జరగబోయేటువంటి ప్రదర్శనకు గాను మాదిగ కళామండలి గ్రామ కమిటీ ఎన్నుకున్నారు.గ్రామ గౌరవ అధ్యక్షులుగా బొంకూరి కొమురయ్య, అడ్డూరి కొమురయ్య, బొంకూరి సుధాకర్, అధ్యక్షులుగా బొంకూరి ఐలయ్య, ఉపాధ్యక్షులుగా అడ్డూరి రమేష్, ప్రధాన కార్యదర్శిగా చిలుముల నరేష్, సహాయ కార్యదర్శిగా చుంచు ప్రవీణ్, కోశాధికారిగా చిలుముల రమేష్, క్యాషియర్ గా ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా బొంకూరి రమేష్,మైస శ్రీనివాస్,అడ్డూరి సుధాకర్, బొంకురి ఆనంద్, అడ్డూరి శ్రీకాంత్, బొంకురి అరుణ్, బొంకురి పెద్ద ఐలయ్య లను ఎన్నుకోవడం జరిగింది అని తెలిపారు.




TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101